క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న చేరికలు



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: మండలంలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. వడ్ల రామాపురం గ్రామం నుంచి 10 కుటుంబాలు మంగళవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. రమణ, సుజాతమ్మ, రాజశేఖర్, సామెల్, జయమ్మ, వెంకటరమణ తదితరులు పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బాలస్వామియాదవ్, రాజారెడ్డి, శేసిరెడ్డి, నాగార్జునరెడ్డి, ఎం.పుల్లయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రాజకీయ నాయకులను కలిసినా, ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా కఠిన చర్యలు తప్పవని శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే దేవస్థాన మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. దేవస్థాన నోటీసు బోర్డులో కూడా ప్రకటనను అంటించారు. ఆ ప్రకటనలో దేవదాయ చట్టాలకు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారము శ్రీశైల క్షేత్ర పరిధిలో నివాసితులు, బయట వ్యక్తులు క్షేత్ర పురవీధుల్లో, వసతి భవనములు, దుకాణముల సముదాయము, ప్రైవేట్ సత్రముల వద్ద రాజకీయ పార్టీలకు సంబంధించిన కండువాలు, టోపీలు పెట్టుకుని ఎన్నికల ప్రచారము చేయడం నిషేధించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకు దేవస్థాన రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని, ఎవరైనా పాల్గొంటే ఉద్యోగుల సర్వీసును నిలుపుదల చేస్తామని హెచ్చరించారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

కొత్తపల్లి: తహసీల్దార్ తిరుపతయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది మండలంలోని ఆయా గ్రామాలలో మంగళవారం ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాలలో ఓటరు జాబితాలో ఉన్న వారి వివరాలు తీసుకొని ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు స్లిప్పులను అందజేస్తున్నారు. ఏమైన పేరు, ఫొటో, చిరునామా ఇతర వివరాలలో తప్పులు ఉంటే సరిచూసుకోవాలని ఓటర్లకు సూచిస్తున్నారు. ఎదురుపాడు, జడ్డువారిపల్లె గ్రామాలలో ఓటరు స్లిప్పులు పంపిణీ చేశారు.


సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిపిస్తామని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మంగళవారం రాత్రి మండలంలోని దుద్యాల, శివపురం గ్రామాల్లో ఎన్నికల నేపథ్యంలో పోలీస్ కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. మండలంలో దుద్యాల, శివపురం గ్రామాలను సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించడంతో పాటు ప్రత్యేక పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు సీఐ నాగభూషణ్ యాదవ్, ఎస్‌ఐ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలి



తాతకు కరపత్రం అందిస్తున్న మహిళలు

మహానంది: బండిఆత్మకూరు మండలం పెద్దదేవలాపురం గ్రామంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి బంధువులు శ్రీవాణిరెడ్డి, హరితారెడ్డి, రామమహేశ్వరి, నాయకులు దూదేకుల బాబు, నాగేంద్రనాయక్ మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డిలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

జగనన్నతోనే ప్రజల జీవితాల్లో వెలుగు

- సీఎం వైఎస్ జగన్ దృష్టిలో మేనిఫెస్టో పవిత్ర గ్రంథం
- ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని మహిళలను కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్

పాములపాడు: రాష్ట్రంలో ప్రజల జీవితాల్లో వెలుగులు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని నందికొట్కూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ అన్నారు. మంగళవారం మండలంలోని వేంపెంట, సుంకులమ్మ కొట్టాల, శ్రీరాంనగర్ గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించగా ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ఇళ్లలోకి ఆహ్వానించి దుశాలువా, పూలమాలలతో సత్కరించారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన పథకాలను వివరిస్తూ తమ ఓటు కచ్చితంగా ఫ్యాన్ గుర్తుకే అంటూ ప్రజలు చెప్పారు. ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టో పవిత్ర గ్రంథంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భావిస్తారని, చెప్పేదే చేస్తారని వివరించారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి తనను ఎమ్మెల్యేగా, పోచా బ్రహ్మానందరెడ్డిని ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు, కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాయని వివరించారు.

ఏ కష్టం వచ్చినా ఆదుకుంటా..

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు ముందుంటానని దారా సుధీర్ హామీ ఇచ్చారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరీక్షించి వైద్య సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, నాయకులు రమణారెడ్డి, చలమారెడ్డి, రఘురామిరెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, ఏసురత్నం, సామేలు, సర్పంచ్‌లు వరప్రసాద్, కోట్ల చంద్రారెడ్డి, మౌలాలి, ఎంపీటీసీలు బషీర్ అహమ్మద్, సురేష్, కో ఆప్షన్ మెంబర్ ముర్తుజావలి, సొసైటీ చైర్మన్ చౌడయ్య, గడ్డం కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు, డైరెక్టర్ గోపాల్, నాయకులు జబ్బార్, మహానందిరెడ్డి, బాలనాయక్, హుసేన్, ప్రభాకర్, కమలాకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమం జగనన్నతోనే సాధ్యం



నెహ్రూనగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న డాక్టర్ బైరెడ్డి శివారెడ్డి

పగిడ్యాల: పేదల సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని డాక్టర్ బైరెడ్డి శివారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నెహ్రూనగర్‌లో మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గడిచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో ఎంతో పురోభివృద్ధిని సాధించిందని, విద్యారంగంలో దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ షుకూర్‌మియ్య, మండల అధ్యక్షుడు పుల్యాల నాగిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రమేష్‌నాయుడు, ఎంపీటీసీ చంద్రమోహన్‌నాయుడు, నాయకులు పులేంద్రనాయుడు, పాలూరు వెంకటేశ్వర్లు, బండారు చంద్రమోహన్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ శిరిగిరెడ్డి చంద్రారెడ్డి, ఆవాజ్‌కమిటీ నాయకులు సలాంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

నందికొట్కూరు: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నందికొట్కూరు నుంచి మిగిలిన అభ్యర్థుల జాబితా తేలింది. స్క్రూట్నీ, నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో 18 మంది నిలిచారు. నోటా కలిపి 19 గుర్తులకు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాట్లు చేయనున్నారు. ఈ మేరకు మంగళవారం పోటీలో మిగిలిన అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. ఇందులో గుర్తింపు పొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్‌కు ఫ్యాను, టీడీపీ అభ్యర్థి జయసూర్యకు సైకిల్, బీఎస్పీ అభ్యర్థి గద్దల లాజర్‌కు ఏనుగు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తొగురు ఆర్థర్‌కు హస్తం, ఇక రిజిస్టర్డ్ పార్టీలైన సూపర్ రేజంర్స్ పార్టీ అభ్యర్థి కరుణాకర్‌కు అగ్గిపెట్టె, సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి నక్క రాజేష్‌కు సైకిల్ పంపు, ఇండియా ప్రజాబంద్ పార్టీ అభ్యర్థి పల్లె నాగరాజుకు బాకా, ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి పార్టీ పూల హరిబాబుకు బల్ల, జై భారత్ నేషనల్ పార్టీ బొరెల్లి వెంకటరాముడుకు బాటరీ లైట్, భారత చైతన్య యువజన పార్టీ చిమ్మె వెంకటరమణకు గన్ని కిసాన్, జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ కే.వెంకటేశ్వర్లుకు గ్యాస్ సిలిండర్, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి శాబోలు లింకన్‌రాజుకు కుట్టు మిషన్, అన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సగినేల వెంకటరమణకు బాట్స్‌మెన్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సాగరాజు మునెయ్యకు బావి, స్వతంత్ర అభ్యర్థులు గాదే సుధీర్‌కు కత్తెర, కే.జయన్నకు పుట్‌బాల్, పిడిసెల శ్రీనివాసులుకు ఎయిర్ కండిషనర్, మిద్దె బాలరాజుకు టైరు గుర్తు కేటాయించినట్లు ఆర్‌ఓ వెల్లడించారు.

శ్రీశైలం అసెంబ్లీ అభ్యర్థులకు..

ఆత్మకూరు: శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించినట్లు ఎన్నికల అధికారిణి సుధారాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 18 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, వారికి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికల గుర్తులను కేటాయించినట్లు చెప్పారు. ఇస్మాయిల్ (ఇండియన్ నేషన్ కాంగ్రెస్) హస్తం గుర్తు, పల్ల చంద్రశేఖర్ (బహుజన సమాజ్‌పార్టీ) ఏనుగు గుర్తు, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి (టీడీపీ)కు సైకిల్ గుర్తు, శిల్పా చక్రపాణిరెడ్డికి (యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ) సీలింగ్ ఫ్యాన్, గుండ్ల మల్లికార్జునగౌడ్ (నేషనల్ మహాసభ పార్టీ) హాకీ అండ్ బాల్ గుర్తు, చింతల నాగేశ్వరరావు (జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ) గ్యాస్ సిలిండర్, మధు(నవభారత్ నిర్మాణ సేవా పార్టీ) టెలివిజన్, సుస్మిత (జై భీమరావు భారత పార్టీ) కోట్, యూనుస్ (సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా) సీవింగ్ మిషన్, లోకేశ్వర్‌రెడ్డి (జై హిందుస్థాన్ పార్టీ) హెల్మెట్, జయనారపురెడ్డి (భారత జనసేన పార్టీ) పెన్ స్టాండ్ గుర్తులను కేటాయించినట్లు ఆర్వో వెల్లడించారు.

లింగాలగట్టులో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలు



లింగాలగట్టులో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం



మైనార్టీల భవిష్యత్‌ను కాపాడుకోవాలంటూ ముస్లింల ప్రచారం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలం లింగాలగట్టు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెండా రెపరెపలాడుతోంది. మంగళవారం కృష్ణవేణి మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు కొండబాబు, ముడి శ్రీను, కోదండలం ఆధ్వర్యంలో వైజాగ్ క్యాంప్‌లో ప్రచారం నిర్వహించారు. గ్రామంలో దాదాపుగా టీడీపీ నాయకత్వం కొరవడింది. బోయక్యాంప్, వైజాగ్ క్యాంప్‌లలో శిల్పా చక్రపాణిరెడ్డికి ఆదరణ పెరిగింది. శిల్పా చక్రపాణిరెడ్డి మత్స్యకారుల అభివృద్ధి కోసం చేపట్టిన వివిధ కార్యక్రమాలు ఆయనను ఆశీర్వదిస్తున్నాయి. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో జగ్గారావు, సి.హెచ్.సోమేశ్వరరావు, మైలపిల్లి శ్రీను, విజయ్‌కుమార్, కె.మల్లికార్జున పాల్గొన్నారు.

ముస్లింలంతా వైఎస్సార్‌సీపీ వైపే

బీజేపీతో జత కట్టిన ఏ పార్టీకీ ఓటు వేయబోమని, రాష్ట్రంలో సెక్యులర్ పార్టీ అయిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేసి ఆదరిస్తామని శ్రీశైలం మండల ముస్లిం పెద్దలు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించడంతో పాటు వ్యాపార దుకాణాల వద్ద మేనిఫెస్టో బ్రోచర్లను అందించారు. అన్ని మసీదుల మౌజన్, ఇమాంలతో సమావేశం నిర్వహించి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ముస్లిం మైనార్టీ నాయకులు గౌస్‌మోహిద్దీన్, జుటూరు ఖాదర్, ఎస్‌కే ముస్తఫా, హిదాయతుల్లా, గఫార్‌బాషా మాట్లాడుతూ కేంద్రంలో ఈసారి బీజేపీ పరిపాలన చేపడితే ముస్లింలు, క్రిస్టియన్లను బానిసలుగా మార్చే చట్టాలను తీసుకువస్తారన్నారు. శ్రీశైలం మండలంలో ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో మగ్బుల్, పి.హుస్సేన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మరోసారి పట్టం కట్టండి



శ్రీశైలంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర ప్రజలందరికీ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సంక్షేమ పథకాలు అందించిన సంక్షేమ సారథికి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ రజాక్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీశైలంలోని 7వ బూత్, 10వ బూత్‌ల పరిధిలోని ఎస్సీ కాలనీ, శ్రీగిరి కాలనీ, కొత్తపేట తదితర ఏరియాలలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శ్రీశైల నియోజకవర్గాన్ని గతంలో ఏ నాయకుడు చేయని విధంగా శిల్పా చక్రపాణిరెడ్డి అభివృద్ధి చేశారన్నారు. మే 13న జరుగనున్న ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని, శ్రీశైలం ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఎమ్మెల్యే శిల్పా వియ్యంకులు రాజేంద్రరెడ్డి దంపతులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు టీఎండి.రఫి, లోకేష్, విష్ణు, అనిల్ కుమార్‌రెడ్డి, ప్రభావతి, కొటమ్మ, కుమార్, శరత్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్ పర్యటనను విజయవంతం చేయండి

కొత్తపల్లి: ఏపీ శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం చేపట్టనున్న మండల పర్యటనను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానంద రెడ్డిలకు మద్దతుగా ప్రచారం నిర్వహించనున్నారు. పాతమాడుగుల, ఎర్రమఠం, ఎర్రమఠం గూడెం, ముసలిమడుగు, చిన్న గుమ్మడాపురం, పెద్దగుమ్మడాపురం, సింగరాజుపల్లె, బట్టువారి పల్లె, శివపురం, ఎం.లింగాపురం గ్రామాలలో పర్యటిస్తారని పేర్కొన్నారు.

నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి పింఛన్ నగదు

కొత్తపల్లి: మే నెల పింఛన్ నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమచేస్తామని ఎంపీడీఓ జవహర్ బాబు మంగళవారం తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో సుమారు 4,313 మంది వృద్ధాప్య, వితంతు, వికలాంగ, మత్స్యకార, చర్మకళాకారుల, ఒంటరి మహిళ పింఛన్‌లతో పాటు ఇతర పింఛన్ దారులు ఉన్నారని తెలిపారు. బ్యాంకు ఖాతాకు ఫోన్‌నంబర్, ఆధార్ నంబర్ జతకాని వారికి, నడవలేని వారికి, మంచానికి పరిమితమైన వారికి సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందజేస్తారని వెల్లడించారు.

తప్పిన ప్రమాదం

మిడుతూరు: మండలపరిధిలోని తలముడిపి గ్రామంలోని మారెమ్మ గుడి సమీపంలోని కుందూ నదిలో ఉన్న గడ్డి, చెత్తాచెదారానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గుడి సమీపంలో మంటలు వ్యాపించడంతో గమనించిన కాలనీవాసులు బిందెలతో నీటిని చల్లి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. కొద్దిగా ఆలస్యం జరిగింటే ఏటిగడ్డన ఉన్న వాములు దగ్ధమై లక్షల్లో నష్టం వాటిల్లేదని వాపోయారు. ఎలాంటి నష్టం వాటిల్లకపోవడంతో మైనార్టీ, కుమ్మరి, ఎస్సీ కాలనీవాసులు ఊపిరిపీల్చుకున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పగిడ్యాల: పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్ మంగళవారం తెలిపారు. పగిడ్యాల గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసి వారి వద్ద నుంచి రూ.4,100 స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన పేకాటరాయుళ్లు పగిడ్యాల గ్రామానికి చెందిన వారని చెప్పారు.

3,988 పింఛన్లు బ్యాంకులో జమ

జూపాడుబంగ్లా: మే మాసానికి సంబంధించి మండలానికి మంజూరైన 5,121 పింఛన్లలో 3,988 మంది లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమచేసినట్లు ఎంపీడీఓ నూర్జహాన్ మంగళవారం తెలిపారు. మిగిలిన 1,133మందిలో దివ్యాంగులు, నడవలేని వారు, మంచానికి పరిమితమైన వారుండటంతో వారికి ఇంటివద్దకే పింఛన్ అందజేయనున్నట్లు వెల్లడించారు. బ్యాంకు ఖాతా విషయంలో ఏమైనా సమస్యలున్నట్లయితే వెంటనే ఎంపీడీఓ కార్యాలయంలో తెలియజేస్తే పరిష్కరిస్తాన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



పాత ముచ్చుమర్రి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల ప్రత్యేక అధికారి పంకజ్‌కుమార్

పగిడ్యాల: సమస్యాత్మకమైన నెహ్రూనగర్ 1, 2, 3, 5, 6 పోలింగ్ స్టేషన్లు, పాత ముచ్చుమర్రిలోని 91, 92, 93 పోలింగ్ స్టేషన్లను ఎన్నికల ప్రత్యేక అధికారి పంకజ్‌కుమార్ (ఐఏఎస్) మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని రిటర్నింగ్ అధికారి దాసును ఆదేశించారు. పాత ముచ్చుమర్రిలోని 91, 93 పోలింగ్ కేంద్రాలలో కిటికీలు, ర్యాంప్ సరిగా లేకపోవడంపై సెక్టోరియల్ అధికారి సంజన్నపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోగా పునరుద్ధరించాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ చేసేందుకు వీలుగా విద్యుత్ సదుపాయం, ఫ్యాన్ల ఏర్పాటు, ఇతరత్రా మౌలిక సదుపాయాలు వెంటనే ఏర్పాటు చేయాలని ఆర్వోకు ఆదేశించారు. ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ, తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎస్‌ఐ జయశేఖర్ తదితరులు ఉన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తేనే మళ్లీ సంక్షేమం



గాజులపల్లె ఆర్‌ఎస్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- ఓటు అడిగే హక్కు టీడీపీకి లేదు
- ప్రజల సంక్షేమం కోరే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలి
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, బుడ్డా శేషారెడ్డి

మహానంది: ఎన్నికల్లో గెలిచాక హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన టీడీపీకి ఓటు అడిగే హక్కు లేదని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గాజులపల్లె, గాజులపల్లె ఆర్‌ఎస్, ఎంసీ ఫారం గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గాజులపల్లెలో గోపవరం సొసైటీ చైర్మన్ గాజులపల్లె కిట్టు, సీనియర్ నేత కొండా మధుసూదన్‌రెడ్డి, బీసీ సంఘం నాయకుడు గజ్జ పెద్ద పక్కీరయ్య, గాజులపల్లె సర్పంచ్ గడ్డం చంటి ఆధ్వర్యంలో వారికి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ఇంటి వద్దకే వస్తున్న సంక్షేమ పథకాలను రద్దు చేస్తారని, ఈ విషయాన్ని ఓటర్లు, ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ ముస్లింలు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీల ఆర్థిక సంక్షేమానికి, రాజకీయంగా ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా సుపరిపాలన అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. మంచి పేరు వస్తుంటే చూసి ఓర్వలేక వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ నేతలు ఈసీకి ఫిర్యాదు చేసి పింఛన్ దారులను ఇబ్బందులకు గురిచేశారన్నారు.

గాజులపల్లె అభివృద్ధికి ఎంతో కృషి

గాజులపల్లె గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశానని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రాలు, రెండు సచివాలయాలు, సహకార గోడౌన్ నిర్మించామన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న గాజులపల్లె-బసాపురం రోడ్డు నిర్మాణానికి రూ. 2.10కోట్లతో భూమిపూజ చేశామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే గాజులపల్లె అంకిరెడ్డిచెరువు, బసాపురం చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. నష్టపోయిన అరటి రైతులకు పరిహారం అందిస్తామని, ఇళ్ల స్థలాలు లేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీలకు అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించే బాధ్యత తనదని భరోసానిచ్చారు.

ఫ్యాన్ గుర్తు సంక్షేమానికి చిహ్నం

ఫ్యాన్ గుర్తు సంక్షేమానికి చిహ్నం అని, వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే పేదలకు గౌరవం లభించిందని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసపూరిత హామీలు నమ్మి ప్రజలు ఓటేస్తే ప్రస్తుతం వస్తున్న సంక్షేమ పథకాలన్ని నిలిచిపోతాయన్నారు. పేదల ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా గతంలో కంటే మిన్నగా జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టో రూపొందించారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మండల యువనేత ఒంటెద్దు వీరారెడ్డి, సర్పంచ్ గడ్డం చంటి, ఎంపీటీసీ నరసింహులు, చౌటుపల్లి నరసింహ, వాల్మీకి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజులపల్లె జయరాం, జిల్లా అధ్యక్షుడు మీనిగ నారాయణ, మేదర సంఘం నాయకుడు టంగుటూరి ప్రశాంత్, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, గాజులపల్లె ఆర్‌ఎస్ మాజీ ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసులు, నాయకులు బాలయ్య గౌడ్, శేషన్నగౌడ్, దినేష్, పరదేశి అనిల్ బాబు, సుధాకర్, కూల్‌డ్రింక్స్ శ్రీనివాసులు, కారు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన జగనన్నతోనే సాధ్యం



పారుమంచాలలో ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

జూపాడుబంగ్లా: అవినీతికి ఆస్కారం లేని పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పారుమంచాల గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి రెకమెండేషన్, పైసా ఖర్చు లేకుండా అర్హత ఉన్న వారందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలిచ్చిన ఏకైక వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో తమకు న్యాయం జరిగిందని భావిస్తే మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు హేమశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ చల్లాశేఖర్‌రెడ్డి, లోకేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్, అనిల్‌నాయుడు, శేఖర్, అంకన్న, మహేష్‌నాయుడు, భరత్‌రెడ్డి, సోమశేఖర్, చిన్నస్వాములు, నాగరత్నం, స్వామిదాసు, ఐజయ్య, వెంకటస్వామి, జాకీర్, ఖాజా, ఇబ్రహీం, రాము, శివకుమార్, ప్రసాదు, ఎల్లప్ప, మాధవరం కళ్యాణ్, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో విద్యా, వైద్యానికి పెద్దపీట



వెలుగోడు పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న శ్వేతారెడ్డి

వెలుగోడు: వైఎస్ జగన్ ప్రభుత్వంలో విద్యా, వైద్యానికి పెద్దపీట వేశారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కూతురు శ్వేతారెడ్డి తెలిపారు. మంగళవారం వెలుగోడు పట్టణంలోని ద్వారకానగర్, సీపీ నగర్, జీబీఎం కాలనీలో శిల్పా చక్రపాణిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ.. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..పేద, మధ్య తరగతి ప్రజలకు ఆరోగ్యం, విద్య ఉచితంగా అందజేయాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం ఎంతో గొప్పదన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద 25 లక్షల రూపాయల వరకు ఉచిత చికిత్సను అందించేలా పథకాన్ని ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ఎన్నికల్లో మీరంతా ఒక్కసారి ఫ్యాను గుర్తుపై బటన్ నొక్కి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిలను అఖండ మెజారీటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ గుండ్రెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, మండల కార్యదర్శి కే. రామ్మోహన్ రెడ్డి, మాలిక్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


తప్పుడు ప్రచారాలు చేసి కన్నీళ్లు పెడితే ఓట్లు పడవు




మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి

జూపాడుబంగ్లా: ఓట్లకోసం బైరెడ్డి శబరి తండ్రి తర్వాత తండ్రిలాంటి బైరెడ్డి మల్లికార్జునరెడ్డిపై అభాండాలు వేసి కన్నీళ్లు పెట్టుకుంటే ఓట్లు పడవని వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తాటిపాడు గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ.. తాను తర్తూరుకు వెళ్లినప్పుడు గుండాలతో బైరెడ్డి మల్లికార్జునరెడ్డి తోయించాడని సోమవారం నందికొట్కూరులో జరిగిన ప్రజాగళం సభలో బైరెడ్డి శబరి మొసలికన్నీరు పెట్టుకోవడం తగదన్నారు. తర్తూరులో శబరమ్మ దర్శనం చేసుకొని వెళ్లిన తర్వాత ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దారాసుధీర్, సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు బైరెడ్డి మల్లికార్జునరెడ్డి గుడిలోకి వెళ్లటం జరిగిందన్నారు. ఆ సమయంలో ఎలా శబరమ్మను గుండాలతో మల్లికార్జునరెడ్డి తోయించాడో రంగనాథునికే తెలుసన్నారు. ఆడపిల్లలకు అన్యాయం జరిగితే జగన్‌మోహన్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవరూ ఉపేక్షించరని స్పష్టం చేశారు. జయసూర్యకు బైరెడ్డి సిద్ధార్థరెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. సిద్ధార్థరెడ్డి గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని, తప్పుడు మాటలు మాట్లాడితే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో కోసిక తరుణ్‌కుమార్‌రెడ్డి, వంగల శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న ఎన్నికల ప్రచారం



15వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాన్వితారెడ్డి, వైస్ చైర్ పర్సన్ పువ్వాడ దివ్య



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి శిల్పా భాగ్యలక్ష్మి, చైర్ పర్సన్ ఆసియా మారూఫ్



ఇందిరేశ్వరంలో ఫ్యాను గుర్తుకు ఓటెయ్యాలని కోరుతున్న మండలాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలో, మండలంలోని ఆయా గ్రామాల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం కొనసాగుతుంది. పట్టణంలోని 15వ వార్డులో వార్డు ఇన్‌చార్జ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పువ్వాడ దివ్య భాస్కర్, శ్యామ్ ఆధ్వర్యంలో శిల్పా కార్తీక్‌రెడ్డి సతీమణి శిల్పా మాన్వితారెడ్డి ఇంటింటి ప్రచారానికి వెళ్లగా వారికి గజమాలతో, హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. ఎన్నికల్లో శిల్పా చక్రపాణిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అశ్వర్థామరెడ్డి, పువ్వాడ భాస్కర్, రాజగోపాల్, జోసఫ్, రామచంద్రయ్యశెట్టి, వెన్న భోగిరెడ్డి, వలీ, జక్కా మురళి, మారుబోతుల విజయ్, మారుబోతుల స్వామి, రామయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సతీమణి శిల్పా భాగ్యలక్ష్మి పట్టణంలోని వివిధ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారుఫ్, కో ఆప్షన్ మెంబర్ రషీద్ ఆమెకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు మునీర్‌బాషా, రాజగోపాల్, పాణ్యం పార్వతి, మహ్మద్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఇందిరేశ్వరంలో ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి తరఫున పార్టీ మండలాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.